క్లుప్తంగా

నైపుణ్యాభివృద్ధి శిక్షణకు ఆహ్వానం

కాకినాడ సిటీ: వికాస ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ నుంచి వాకలపూడి డీడీయూజీకేవై సెంటర్‌లో నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు సోమవారం విలేకర్లకు తెలిపారు. ఈ శిక్షణకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమో ఉత్తీర్ణులైన 18 నుంచి 30 ఏళ్ల లోపు పురుష అభ్యర్థులు అర్హులన్నారు. టూ వీలర్ టెక్నీషియన్, వేర్‌హౌస్ ఎగ్జిక్యూటివ్ కోర్సులకు మూడు నెలల శిక్షణ ఇచ్చి అనంతరం ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగం కల్పిస్తారన్నారు. శిక్షణ అనంతరం కేంద్ర ప్రభుత్వం ద్వారా సర్టిఫికెట్ ఇస్తారన్నారు. ఈ సమయంలో భోజనం, వసతి, యూనిఫామ్, స్టడీ మెటీరియల్ అందిస్తామన్నారు. పై కోర్సులతో పాటు అదనంగా బేసిక్ కంప్యూటర్ కోర్సు, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్‌పై శిక్షణ ఇస్తారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 9వతేదీ సోమవారం లోపు 83284 83297, 89794 75164 ఫోన్ నంబర్లలో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

దంత వైద్యులకు సత్కారం



రమణయ్యపేటలో దంత వైద్యులను సన్మానిస్తున్న సభ్యులు

కాకినాడ రూరల్: ప్రపంచ దంత వైద్యుల దినోత్సవం సందర్భంగా రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో దంత వైద్యులు అడ్డాల సత్యనారాయణ, సువర్ణరాజు తదితరులను సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా న్యాయవాది రవిశంకర్ పట్నాయక్, అడబాల రత్నప్రసాద్ మాట్లాడుతూ నోటి ఆరోగ్య సంరక్షణలో దంత వైద్యుల పాత్ర కీలమన్నారు. కాకినాడ ఐడీఏ కార్యదర్శి అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ దశాబ్ద కాలంగా దంత వైద్య రంగం సాంకేతిక పురోగతి సాధించిందని, రోగ నిర్ధారణ, చికిత్స, రోగి సంరక్షణపై మెరుగైన ఫలితాలు చూపుతున్నాయన్నారు.

హరీష్‌కు అభినందన

బోట్‌క్లబ్: స్థానిక జిల్లా క్రీడా మైదానంలో పదేళ్లుగా మరుగుదొడ్ల సదుపాయం లేక క్రీడాకారులు, వాకర్స్ అనేక ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్యను గుర్తించిన డీఎస్‌డీఓ శ్రీనివాస్‌కుమార్ విషయాన్ని సానా సతీష్‌బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ దృష్టికి తీసుకొచ్చారు. ఆయన వెంటనే రూ.3.50 లక్షలతో కొత్త మోటారు, వాటర్ ట్యాంకు, కొత్త కమోడ్స్, మరుగుదొడ్లకు తలుపులు ఏర్పాటు చేయించి ఆధునీకరించారు. దీంతో ఇటీవల నిర్వహించిన స్కూల్స్ గేమ్స్ రాష్ట్ర స్థాయి పోటీలు, ఆల్ ఇండియా సివిల్ హాకీ టోర్నమెంట్లకు వచ్చే వారికి ఎంతో ఉపయోగపడ్డాయని వాకర్స్, కోచ్‌లు, చీఫ్ కోచ్ శ్రీనివాసకుమార్‌లు తలాటం హరీష్‌ను సోమవారం జిల్లా క్రీడా మైదానంలో అభినందించారు.

విద్యార్థిని చదువుకు అండగా..



విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేస్తున్న బొల్లం సతీష్

కాకినాడ క్రైం: తన పుట్టిన రోజున ఓ వ్యాపారవేత్త పేద విద్యార్థిని చదువుకు అండగా నిలిచి ఆదర్శాన్ని చాటుకున్నాడు. కాకినాడకు చెందిన ఓదూరి సతీష్ సోమవారం తన పుట్టినరోజు సందర్భంగా నగరానికి చెందిన డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని అమ్మాణి చదువు నిమిత్తం రూ.25 వేల సాయం చేశారు. ఈ మొత్తాన్ని కాకినాడ గ్లాస్ హౌస్ సెంటర్‌లో ఉన్న శ్రీ యువసేన బ్లడ్ బ్యాంక్‌లో శ్రీ యువసేన స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ బొల్లం సతీష్ చేతుల మీదుగా అందజేశారు.

భూములు స్వాధీనం చేసుకోవాలి

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): దేవదాయ శాఖకు చెందిన భూములు వేరే వ్యక్తులు స్వాధీనం చేసుకున్నా అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని యు.కొత్తపల్లి మండలం గోర్స గ్రామస్తులు వాపోయారు. ఈ మేరకు కాకినాడ దేవదాయ శాఖ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. గోర్సలో సీతారామస్వామికి చెందిన 19.92 ఎకరాలను కౌన్నేళ్లుగా 24 మంది అనుభవిస్తున్నారని ఆందోళనకారులు అన్నారు. దీనిపై ట్రిబునల్‌లో కేసు ఉన్నా ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోనే భూమి ఉందన్నారు. గత నెల 4న భూమిని స్వాధీనం చేసుకునేందుకు నోటీసులు ఇచ్చి దేవదాయ శాఖ అధికారులు పోలీసుల సహకారం కోరినా అదే రోజు ఎమ్మెల్సీ నాగబాబు వస్తున్నారని బందోబస్తు ఇవ్వలేమని చెప్పడంతో భూమి స్వాధీనం చేసుకోలేదన్నారు. దేవదాయ శాఖ అధికారులు భూమిని స్వాధీనం చేసుకునేందుకు షాకులు చెబుతున్నారంటూ గ్రామస్తులు దేవదాయ శాఖ కార్యాలయానికి తాళాలు వేసేస్తామని అధికారులను హెచ్చరించారు. దీంతో జిల్లా దేవదాయ శాఖాధికారి ఈవీ సుబ్బారావు వారికి నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. చివరికి దేవదాయశాఖ డీసీ రమేష్‌బాబు వచ్చి భూములు స్వాధీనం చేసుకునేందుకు చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పడంతో వారు శాంతించారు. తొలుత గ్రామస్తులు జిల్లా కలెక్టర్ షణ్మోహన్‌కు వినతిపత్రం సమర్పించారు.

ఛీఛీ రోడ్లు!



గురజనాపల్లి ఎస్సీ వీధిలో బెర్ములు వేయకుండా వదిలేసిన సీసీ రోడ్డు

- బెర్ములు లేక ప్రమాదాలు
- నిత్యం ప్రయాణ గండాలు
- గురజనాపల్లిలో ఇబ్బందులు

కరప: చక్కని రోడ్లున్నా అటుగా ప్రయాణం దిన దిన గండమైంది.. అభివృద్ధి పనులు చేసినా చిన్నపాటి పనులు చేయక ఇబ్బంది ఎదురవుతోంది.. చక్కగా సీసీ రోడ్లు వేసినా దానికి అనుసంధానంగా బెర్ములు వేయకపోవడంతో అవస్థే మిగులుతోంది.. చిన్నపాటి పనులపైనా అధికారులు, ప్రజాప్రతినిధుల శ్రద్ధ కరవై, జనానికి తిప్పలు తెచ్చిపెడుతోంది.. కరప మండలం గురజనాపల్లి గ్రామంలో పరిస్థితి ఇది. సీసీ రోడ్లు వేయించడంలో చూపిన శ్రద్ధ, బెర్ములు వేయించడానికి చూపకపోవడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. రోడ్డు ఎక్కి, దిగే సమయంలో తడబాటుకు గురై వాహనదారులు ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునేవారే కరవయ్యారు. నెలల తరబడి రోడ్డు పక్కన బెర్ములు వేయకపోవడంలో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు, ద్విచక్ర వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు వేసిన ఆనందం కంటే ఎందుకు వేశారా అని అనిపిస్తుందని అంటున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. గురజనాపల్లి గ్రామంలో రెండున్నర **నెలల కిందట దాసు శివ ఇంటి నుంచి పల్లి శివ ఇం**టి వరకూ, మద్దా సత్యనారాయణ ఇంటి నుంచి ఎస్సీ వీధి రామాలయం వరకూ, ప్రాథమిక పాఠశాలకు వెళ్లే రహదారిలో ఓసీ వీధిలో, మరో రెండు మూడు ప్రాంతాల్లో సీసీ రోడ్లు నిర్మించారు. వీటిని అధికార పార్టీ నాయకులే వేసినట్లు సమాచారం. తర్వాత రోడ్డుకు ఇరువైపులా గ్రావెల్‌తో బెర్ములు వేయించాల్సి ఉంది. దాని మాటే మరిచారు. అధికారులూ పట్టించుకోకపోవడంతో రోడ్డు వేసిన కాంట్రాక్టర్లు బెర్ములు వేయకుండా వదిలేశారు. దీంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై వెళ్తున్న ద్విచక్ర వాహనచోదకులు ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించేందుకు జాగా లేక, అదుపు తప్పి పడిపోయి గాయాల పాలవుతున్నారు. మోటార్ సైకిళ్లకు రోడ్డు అంచు గీసుకుపోయి వాహనాలు దెబ్బతింటున్నాయని పలువురు అంటున్నారు. **రాత్రి సమయాల్లో చిన్న పిల్లలు, వృద్ధులు నడిచి వెళ్లేటప్పుడు అదుపుతప్పి పడిపోతున్నారు. ఎస్సీ వీధిలో రోడ్డుపై రోడ్డు వేయడం వల్ల మరీ ఎత్తుగా ఉందని ఆ ప్రాంత మహిళలు చెబుతున్నారు. ఓసీ వీధిలో అధికార పార్టీ నాయకుల గృ**హాలు ఉండటంతో తమకు ఇబ్బంది లేకుండా సీసీ రోడ్డుకు ఆనుకుని కాంక్రీట్‌తో ర్యాంప్ వేయించుకున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



మరోచోటా అదే దుస్థితి



ఓసీ వీధిలో అధికార పార్టీ నాయకుల గృహాలకు వెళ్లేచోట కాంక్రీట్‌తో వేసిన ర్యాంప్



ఎస్సీ వీధిలో రామాలయం వద్ద నుంచి గృహాలకు వెళ్లేచోట ర్యాంపు లేకుండా..

ఇబ్బంది పడుతున్నాం



ఎస్సీ వీధిలో రోడ్డుపై రోడ్డు వేశారు. దీంతో రోడ్డు ఎత్తుగా మారింది. సీసీ రోడ్డు వేసిన తర్వాత ఇరుపక్కలా బెర్ములు వేయకపోవడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. రోడ్డు పక్కనుంచి లోపలకు ఉండే గృహాల వద్దకు మోటార్ సైకిళ్లపై వెళ్లేటప్పుడు రోడ్డు అంచు తగిలి వాహనాలు దెబ్బతింటున్నాయి. అధికారులు స్పందించి బెర్ములు వేయించాలి.

–రేవు మోహనరావు, ఎస్సీ వీధి, గురజనాపల్లి

ఫిర్యాదు చేసినా స్పందన శూన్యం



సీసీ రోడ్లు వేసినా బెర్ములు వేయించకపోవడంతో వాహనాలపై వెళ్లేవారు ఇబ్బందులకు గురవుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించుకునేందుకు రోడ్డు పక్కకు వెళితే అదుపుతప్పి పడిపోతుతున్నారు. రాత్రి సమయంలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. దీనిపై ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

–లంక విష్ణు, గురజనాపల్లి

మట్టి తవ్వకానికి అనుమతి లేదంటూ జేసీబీ సీజ్

కరప: కరప మండలం వాకాడలో ఒక రైతు భూమిలో మట్టి తవ్వుతుండగా మూడు రోజుల కిందట కరప పోలీసులు జేసీబీని సీజ్ చేయడం వివాదాస్పదమైంది. అనుమతి లేకుండా మట్టి తవ్వుతున్నందునే జేసీబీని స్టేషన్‌కు తీసుకొచ్చామని పోలీసులు అంటున్నారు. దీనికి సంబంధించి బాధితుడు, పెదకొత్తూరు గ్రామానికి చెందిన జేసీబీ యజమాని తోటకూర చినవెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. కరప మండలం వాకాడ గ్రామానికి చెందిన తండ్రీ కొడుకులు లకమన హరిబాబు, నాగవెంకట్రావులు తమ సొంత భూమిలో మట్టిని తవ్వి, ఇంటి పునాదిలోకి తోలాలంటే జేసీబీని రైతుకు అద్దెకు ఇచ్చానని చినవెంకటేశ్వర్లు తెలిపారు. ఈలోగా జనసేన పార్టీకి చెందిన కొంతమంది అనుమతి లేకుండా మట్టి తవ్వుతున్నట్టు ఫిర్యాదు చేయడంతో తన జేసీబీని పోలీసులు తీసుకొచ్చేశారన్నారు. సొంత భూమిలో మట్టి తవ్వడానికి అనుమతి తీసుకోవాలని తనకు తెలియక జేసీబీని అద్దెకిచ్చానని, మూడు రోజులు పని లేక జేసీబీకి కట్టాల్సిన వాయిదా సొమ్మును కట్టలేకపోతున్నానని బాధితుడు వాపోయాడు. అనుమతి లేకుండా మట్టి తవ్వుతున్న రైతులపై చర్యలు తీసుకుని, తన జేసీబీని అప్పగించాలంటూ సోమవారం బాధితుడు కరప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మండలంలో చాలా గ్రామాల్లో మట్టి అక్రమంగా తవ్వుతున్నా చర్యలు తీసుకోవడం లేదని, ఇంటి పునాదిలోకి రైతులు సొంత భూమిలో మట్టి తవ్వుకుంటుంటే అద్దెకు ఇచ్చిన జేసీబీని పోలీస్ స్టేషన్‌కు తీసుకురావడం దారుణమని మండల ఎస్సీ నాయకుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు మారెళ్ల వెంకటరమణ అన్నారు. బాధితుడికి న్యాయం జరిగేవరకూ వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని మారెళ్ల తెలిపారు.

ఈత పోటీల్లో షణ్ముఖ ప్రతిభ



షణ్ముఖను అభినందిస్తున్న డీఎస్‌డీఓ శ్రీనివాస్ కుమార్ తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): పల్నాడు జిల్లా నరసారావుపేటలో ఈ నెల 1న జరిగిన అంతర్ జిల్లాల ఈత పోటీల్లో కాకినాడ జిల్లా క్రీడా మైదానంలోని స్విమ్మింగ్ పూల్‌లో శిక్షణ పొందుతున్న ఎ.షణ్ముఖ ప్రతిభ కనబరిచిందని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్ కుమార్ సోమవారం తెలిపారు. స్విమ్మింగ్ కోచ్ అప్పలనాయుడు వద్ద శిక్షణ తీసుకుంటున్న షణ్ముఖ 400 మీటర్ల ఫ్రీస్టైల్ విభాగంలో బంగారు, 100 మీటర్ల ఫ్రీస్టైల్‌లో బ్రాంజ్ మెడల్ సాధించిందన్నారు. పతకాలు సాధించిన క్రీడాకారిణిని, కోచ్‌ను స్విమ్మింగ్ సంఘ కార్యదర్శి ఐ.రాజు, డీఎస్‌డీఓ శ్రీనివాస్ కుమార్‌లు అభినందించారు.

వెన్నుపోటు స్పెషలిస్ట్ చంద్రబాబు

- మాజీ మంత్రి కురసాల కన్నబాబు విమర్శ
- ప్రజల పక్షాన పోరాటానికే 'వెన్నుపోటు దినం'



వెన్నుపోటు దినం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి కురసాల కన్నబాబు తదితరులు

కాకినాడ రూరల్: రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల్లో ఈ నెల 4 బుధవారం వెన్నుపోటు దినం ద్వారా నిరసన కార్యక్రమాలను వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున చేపట్టనున్నట్టు ఉత్తరాంధ్ర జిల్లాల పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి కురసాల కన్నబాబు అన్నారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలోని రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి వెన్నుపోటు దినం కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాది కాలంలో ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. సూపర్ సిక్స్ పథకాలు, రకరకాల హామీలను ఇచ్చి మోసం చేసిందన్నారు. గత ప్రభుత్వంలో జగన్ సర్కారు చేపట్టిన పథకాలనూ నేడు ఆపేశారని, పేదలను అన్ని రకాలుగా కూటమి ప్రభుత్వం ఇబ్బంది పెడుతుందన్నారు. ఏ ఒక్క కార్యక్రమం సక్రమంగా నిర్వహించడం లేదని, చివరికి పదో తరగతి ఫలితాలను కూడా సక్రమంగా ఇవ్వలేకపోయిందన్నారు. మరోపక్క కక్ష సాధింపుగా అక్రమ కేసులు పెట్టడం, జైలులో వేయడం చేస్తున్నారన్నారు. పసికందులపై అత్యాచారాల నుంచి హత్యలు, అరాచకాలు జరుగుతున్నా ప్రభుత్వానికి కనీసం చీమకుట్టినట్టు లేదన్నారు. గతంలో పెద్ద పెద్ద డైలాగులు చెప్పిన వారు ఇప్పుడు స్పందించడం లేదన్నారు. అందుకే ఎన్నికలు జరిగి జూన్ 4కు ఏడాది అవుతున్నందున వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నామన్నారు. చంద్రబాబు వెన్నుపోటు స్పెషలిస్టుగా నిలిచారన్నారు. చంద్రబాబు మోసాలను ఎండగడతామని, హామీలు నెరవేర్చే వరకూ ప్రతిపక్షంగా పోరాటం సాగిస్తామన్నారు. చంద్రబాబుకు అమరావతి తప్ప ఏమీ కనిపించడం లేదని, అన్ని వర్గాల ప్రజలు ఇబ్బంది పడుతున్నందున ఆలోచించుకోవాలన్నారు.

కార్యక్రమం విజయవంతం చేయాలి

రూరల్‌లో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ కాకినాడ రూరల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు కోరారు. బుధవారం ఉదయం 10 గంటలకు సర్పవరం జంక్షన్‌లో కార్యక్రమం ప్రారంభించి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ అధికారులకు వినతిపత్రం అందిస్తామన్నారు. ఇందులో పార్టీ శ్రేణులు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి, మాజీ మేయర్ పోసలపల్లి సరోజ, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు కొప్పిశెట్టి గణేష్, పార్టీ నేతలు, వివిధ విభాగాల ప్రతినిధులు గోపిశెట్టి బాబ్జీ, పి.నాగబాబు, తోటకూర శ్రీనివాస్, పుల్ల చందు, నేమాం సర్పంచ్ రామదేవు సూర్యప్రకాశరావు, జాన్ ప్రభాకర్, మాజీ కార్పొరేటరు వడ్డి మణికుమార్, నక్కా సత్యనారాయణ, మేడిశెట్టి సత్తిబాబు, వాసంశెట్టి రాంబాబు, కోలా శ్రీనివాస్, దుగ్గిన దొరబాబు పాల్గొన్నారు.

ఆరోగ్యకర జీవనానికి యోగా

- 7న ప్రత్యేక కార్యక్రమం
- కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: స్థానిక త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి మెయిన్ రోడ్డులో కిలోమీటరు మేర ఐదు వేల మంది ఉపాధ్యాయులతో ప్రత్యేక యోగా కార్యక్రమం 7న నిర్వహించనున్నట్టు కలెక్టర్ షణ్మోహన్ సగిలి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని కోర్టు హాల్లో యోగాంధ్ర-2025లో భాగంగా 7న ఉపాధ్యాయులతో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంపై కలెక్టర్ షణ్మోహన్, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ భావన, జేసీ రాహుల్ మీనా ఇతర అధికారులతో కలసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ప్రజలకు ఆరోగ్యవంతమైన జీవనశైలి పట్ల అవగాహన కల్పించే ఉద్దేశంతో శనివారం ఉదయం 6.30 గంటల నుంచి 9 గంటల వరకూ ప్రత్యేక యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో మెయిన్ రోడ్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి జగన్నాథపురం వంతెన వరకూ 6వ తేదీ రాత్రి 8 గంటల నుంచి 7వ తేదీ ఉదయం 10 గంటల వరకూ ట్రాఫిక్‌ను నిలుపుదల చేయాలని పోలీస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వాహనదారులు, దుకాణాల యజమానులకు ముందుగానే సమాచారం అందించాలన్నారు. సాధారణ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ నియంత్రణ చేపట్టాలని పోలీస్ శాఖకు సూచించారు. 7న సూర్య కళామందిర్‌లో 200 మందితో, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో 300 మందితో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. సులభంగా చేయగల యోగాసనాలు, శ్వాస పద్ధతులను శిక్షకులు నేర్పిస్తారన్నారు. సమావేశంలో ఏఎస్పీ మానిస్‌పాటిల్ దేవరాజ్, డీఆర్వో వెంకటరావు, జెడ్పీ సీఈఓ లక్ష్మణరావు, డీపీవో వి.రవికుమార్, డీఈఓ పి.రమేష్, డీఆర్‌డీఏ పీడీ జి.శ్రీనివాసరావు, డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, డీఎస్‌వో శ్రీనివాసరావు, ఆయుష్ డాక్టర్ అలీ పాల్గొన్నారు.



వివిధ శాఖల అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

మాదక ద్రవ్యాల నిరోధానికి ప్రత్యేక కార్యక్రమాలు

మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో ఈ నెల 1 నుంచి 26వ తేదీ వరకూ వివిధ కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. నషాముక్త భారత్ అభియాన్‌లో భాగంగా మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలు వల్ల కలిగే అనర్థాలను సూచిస్తూ రూపొందించిన పోస్టర్లను కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్, జేసీ రాహుల్ మీనా, డీఆర్వో జె.వెంకటరావు, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు వీవీవీఎస్ లక్ష్మణరావు, ఈగల్ డిపార్టుమెంట్ అధికారులతో కలసి ఆవిష్కరించారు. ఈ నెల 26న మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని చేపట్టే కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలన్నారు.

యోగా సాధనతో మానసిక ఆరోగ్యం

కాకినాడ సిటీ: యోగా సాధనతో శారీరక, మానసిక ఆరోగ్యం సాధ్యమని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర విభాగ చైర్మన్ యార్లగడ్డ దశరథ రామారావు అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సమాచార పౌర సంబంధ శాఖ, రెడ్‌క్రాస్ సొసైటీ, ఆయుష్ జిల్లా విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో కాకినాడ రాజా ట్యాంక్ ఆవరణలోని రెడ్‌క్రాస్ యోగా కేంద్రంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న జర్నలిస్టుల యోగా శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యోగా శిక్షణ పూర్తి చేసుకున్న జర్నలిస్టులను ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర విభాగం చైర్మన్ వైడీ రామారావు, ఆయుష్ జిల్లా విభాగం వైద్యాధికారి ఎంఎస్ అలీ, జిల్లా సమాచార పౌర సంబంధ శాఖ డిప్యూటీ డైరెక్టర్ డి.నాగార్జున అభినందించారు. వైడీ రామారావు మాట్లాడుతూ శారీరక, మానసిక ఆరోగ్యాన్ని ఉద్దీపన చేసి మనిషి పరిపూర్ణ వికాసానికి యోగా, ధ్యాన ప్రక్రియలు దోహదపడతాయన్నారు. జర్నలిస్టుల కోసం ఇటువంటి శిక్షణ కార్యక్రమాలను మరిన్ని నిర్వహించేందుకు రెడ్‌క్రాస్ విభాగం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉందన్నారు. ఆయుష్ జిల్లా విభాగ వైద్యాధికారి ఎంఎస్ అలీ మాట్లాడుతూ 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించి జిల్లా వ్యాప్తంగా మండల, గ్రామ స్థాయి నుంచి యోగా శిక్షణ కార్యక్రమాలు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. సమాచార శాఖ డైరెక్టర్ డి.నాగార్జున మాట్లాడుతూ కలెక్టర్ సూచనల మేరకు ఈ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించామన్నారు. శిక్షణ పొందిన జర్నలిస్టులకు రెడ్‌క్రాస్ ద్వారా యోగా మ్యాట్‌లను సంస్థ రాష్ట్ర చైర్మన్ వైడీ రామారావు అందజేశారు. సమాచార శాఖ అధికారి సి.బాబూరావు, జర్నలిస్టు ప్రతినిధులు ఆర్.రాజేష్, ఎస్.శివన్నారాయణరెడ్డి, అనుసూరి సూర్యనారాయణ, కె.శ్రీనివాస్, పి.శ్రీను, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



జర్నలిస్టులకు రెడ్‌క్రాస్ ద్వారా యోగా మ్యాట్‌ను అందజేస్తున్న సంస్థ రాష్ట్ర చైర్మన్ రామారావు

ఒలింపిక్ సంఘానికి ఎనలేని సేవలు



దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డితో సంఘ మాజీ చైర్‌పర్సన్ చిరంజీవినీ కుమారి

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఉమ్మడి తూర్పుగోదావరి పరిధిలో ఒలింపిక్ సంఘానికి మూడు దశాబ్దాలుగా సేవలందించిన ఒలింపిక్ సంఘ గౌరవ మాజీ చైర్‌పర్సన్ డాక్టర్ పి.చిరంజీవినీ కుమారి మృతి జిల్లా క్రీడా రంగానికి తీరని లోటని మాజీ ఒలింపిక్ సంఘ కార్యదర్శి కె.పద్మనాభం అన్నారు. 2007 నుంచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో నిర్వహించిన ఒలింపిక్ రన్‌లో పాల్గొన్న క్రీడాకారులకు చిరంజీవినీ కుమారి సర్టిఫికెట్లు అందజేశారన్నారు. ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 13 మినీ ఒలింపియాడ్ పోటీల నిర్వహణకు ఆమె ఎంతగానో సహకరించారని తెలిపారు. కాకినాడ జిల్లా క్రీడామైదానంలో ఒలింపిక్ భవన్ నిర్మాణానికి దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి శంకుస్థాపన చేయడంలో ఆమె కీలక పాత్ర పోషించారన్నారు. ఒలింపిక్ సంఘంలో ఉన్న ప్రతి క్రీడా సంఘానికి తగిన ప్రోత్సాహాన్ని, వివిధ పోటీల నిర్వహణకు ఆర్థిక సహాయాన్ని అందించారని గుర్తు చేసుకున్నారు.

సాహితీ వికాసానికి ఎంతగానో కృషి

బోట్‌క్లబ్: సామాజిక సంక్షేమం కోసం, సాహితీ వికాసానికి చిరంజీవిని కుమారి ఎంతగానో కృషి చేశారని.. ఆమె మరణం తీరని లోటని వాత్సల్యభారతి సంఘటన కార్యదర్శి మద్దాలి శ్రీనివాసరావు, కార్యదర్శి సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి అన్నారు. స్థానిక వాత్సల్యభారతి కార్యాలయంలో సోమవారం ఆమె సంతాప సభ జరిగింది. కాకినాడలో స్వాతంత్ర్య సమర స్ఫూర్తి పొందేలా గ్రంథాలయాల ఏర్పాటుకు, మహిళా అభ్యుదాయానికి ఆమె ఎంతగానో పాటుపడ్డారన్నారు. కళాశాలలు ఏర్పాటు చేసి ఎంతో మంది మేధావులను తయారు చేశారన్నారు. వాత్సల్యభారతి కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న మత్స్యకారులు

కాకినాడ సిటీ: సముద్ర తీరంలో చమురు ఉత్పత్తి కార్యకలాపాలతో వేట కష్టమై జీవనభృతి కోల్పోతున్నామని యు.కొత్తపల్లి మండలం మూలపేట గ్రామాల మత్స్యకారులు సోమవారం కాకినాడ కలెక్టరేట్ వద్ద నిరసన ర్యాలీ, ధర్నా నిర్వహించారు. జిల్లాలో రిలయన్స్, ఓఎన్జీసీ, ఎస్ఆర్ గుజరాత్, దివీస్, అరబిందో, కాకినాడలో ఉన్న ఆయిల్ ఫ్యాక్టరీలు, ఎన్ఎఫ్‌సీఎల్, కోరమాండల్, షుగర్ ఫ్యాక్టరీల నుంచి వచ్చే కెమికల్ వాటర్, క్రూడ్ ఆయిల్ సముద్రపు అడుగు భాగంగా సుమారు 100 నుంచి 200 కిలోమీటర్ల మేర వ్యాపించడం వల్ల మత్స్య సంపద కోల్పోయి నష్టపోతున్నామని ఆందోళనకారులు ఆవేదన వ్యక్తం చేశారు. తాము చమురు సంస్థలకు వ్యతిరేకం కాదని, వారి కార్యకలాపాలతో బతుకు తెరువు పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సముద్ర వేట తప్పితే మరే ఇతర భూమిగానీ, వ్యాపారంగానీ లేవన్నారు. అందువల్ల ముమ్మిడివరం, యానాం నియోజకవర్గాల్లో మత్స్యకారులకు ప్రతి నెలా ఏ విధంగా రూ. 11,500 ఇస్తున్నారో అదే విధంగా కాకినాడ సిటీ, రూరల్, యు.కొత్తపల్లి, తొండంగి మండలాల్లో ఉన్న మత్స్యకారులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వేట సమయంలో అనుకోని ప్రమాదం జరిగితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ. 50 లక్షల జనరల్ ఇన్సూరెన్స్ ఇవ్వాలని అన్నారు. ఈ కంపెనీల్లో నూటికి 20 శాతం మత్స్యకారులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో పెద్దింశెట్టి వెంకటేశ్వరరావు, రమణిలతో పాటు అధిక సంఖ్యలో మత్స్యకారులు పాల్గొన్నారు.

యువకుడి మృతి

కరప: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఒక యువకుడు కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. కాకినాడ రూరల్ మండలం తూరంగి గ్రామానికి చెందిన సాంబారు శివశంకర్ (33) తాపీమేస్త్రిగా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం శివశంకర్ కరప మండలం పెనుగుదురులో పని చేసేందుకు వెళ్లి, అక్కడ నుంచి కాకినాడ వైపు వెళుతుండగా నడకుదురు మార్కెట్ యార్డు వద్దకు వచ్చేసరికి కుక్క అడ్డురావడంతో బైక్‌పై నుంచి అదుపుతప్పి కింద పడిపోయాడు. అతని తలకు తీవ్ర గాయాలైనట్టు సమాచారం తెలుసుకున్న బావమరుదులు సత్యనారాయణ, నాగవిజయ్‌లు ఘటనా స్థలానికి వెళ్లి, వెంటనే చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శివశంకర్ మృతి చెందాడు. మృతుడి భార్య లోవలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరప ఎస్ఐ టి.సునీత కేసు దర్యాప్తు చేస్తున్నారు.